

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి



◄ ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
- విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
- 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు.. 161 మందికి బంగారు పతకాలు



శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెచ్‌సీయూ వీసీ బీజే రావు, ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్

7

శాతవాహన విశ్వవిద్యాలయ ద్వితీయ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, 161 మందికి బంగారు పతకాలు అందజేశారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసం విద్యార్థుల విజయానికి దోహద పడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలన్నారు. - కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

'వందేమాతరం' ప్రజల భవిష్యత్‌కు భరోసా

మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాలాపన దేశ ప్రజల్లో ఆత్మవిశ్వాసం, ప్రేరణను నింపి భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో వందే మాతరం గీతం వచ్చి 150వ సంవత్సరం అయిన సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో పలు విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వందే మాతరం గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బంకిమ్ చంద్ర చటర్జి రచించిన వందేమాతరం గీతం కోట్లాది ప్రజల గుండె చప్పుడని అన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో ఈ గీతం రణ నినాదంగా ఉపయోగపడిందని గుర్తు చేశారు. వందేమాతరం గీతం దేశమాత ఆరాధన గీతం అన్నారు. వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని పలు వీధుల్లో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి, దేశభక్తి నినాదాలుచేశారు. పాఠశాలల్లో సామూహిక గీతాలాపన చేశారు.

పోలీస్ కమిషనరేట్‌లో..



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం: పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో 150వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పాల్గొని వందే మాతరం గేయాన్ని ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి సామూహికంగా ఆలపించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, ఆర్ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారుల రాష్ట్ర సభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మత్స్యసహకార సంఘాల సమాఖ్య మాజీ ఉమ్మడి రాష్ట్ర చైర్మెన్ చేతి ధర్మయ్య పిలుపునిచ్చారు. నగరంలోని మెడికల్ రిప్రజంటేటివ్స్ భవన్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార వృత్తి రక్షణ-ఉపాధి, సామాజిక భద్రత సాధనకు ఈనెల 25 నుంచి 27 వరకు కరీంనగర్‌లో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సుదీర్ఘ పోరాటాల అనుభవాలు, చరిత్ర కలిగిన సంఘం, ఉమ్మడి రాష్ట్రంలో అనేక రాజీలేని పోరాటాలను నిర్వహించిందన్నారు. కలెక్టరేట్ ఎదురుగా గల రెవెన్యూ గార్డెన్‌లో ఈనెల 25న నిర్వహించే బహిరంగ సభలో వేలాది మంది మత్స్యకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డోలి రాజయ్య, తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేశం, జునగరి గణేశ్, కోశాధికారి పప్పు సదానందం, మర్రి శశికళ, నాగుల అరుణ, షేర్వ మల్లికార్జున్, జడిగల రాజన్న, అంజి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి



స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- టీబీ, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సుభాష్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. ఆయన కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, ప్రముఖులతో శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర స్వరూపంతో పాటు జిల్లా విశేషాలను కలెక్టర్ పమేలాసత్పతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం సభ నిర్వహిస్తూ మహిళలు, పిల్లల పోషణ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

దివ్యాంగుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్క రించేందుకు అధికారులకు, సిబ్బందికి సైన్ లాంగ్వేజీలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ టీబీ, డ్రగ్స్ రహిత కరీంనగర్‌గా తీర్చిదిద్ద డానికి మిషన్‌మోడ్‌లో పని చేయాలని సూచించారు. టీబీ ముక్త్ భారత్‌లో జిల్లాలోని కవులు, కళాకారులు, రచయితలతో పాటు వివిధ రంగాలలోని ప్రముఖులను భాగస్వాములను చేయాలన్నారు.

మేధావులు, విద్యావంతులు ఇంటికే పరితం కాకూడదు...

జిల్లాలో ఉన్న మేధావులు, విద్యావంతులు ఇంటికే పరిమితం కాకుండా జ్ఞానాన్ని సమాజానికి పంచాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. ప్రపంచంలో ఎక్కడ లేని యువత మనదేశంలో ఎక్కువగా ఉందన్నారు. సమాజంలో నాటుకున్న సామాజిక రుగ్మతలను రూపుమాపాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కవులు, కళాకారులు, మేధావులకు కొదవ లేదని, వారి సేవలను అధికారులు వినియోగించుకోవాలని సూచించారు. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయ్యాయని, ఈ గీతం ప్రజలకు ఎప్పుడూ స్ఫూర్తిదాయకంగానిలుస్తుందన్నారు. అనంతరం సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, గద్దర్ అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్ర, దాశరథి అవార్డు గ్రహీత అన్నవరం దేవేందర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంప్ర లక్ష్మణరావు, సినీ నటుడు కేతిరెడ్డి మాల్లరెడ్డి, నటుడు ఆర్ఎస్ నంద, అగ్రికల్చర్ సైంటిస్టు డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, శ్రీబాలాజీ ట్రస్టు(ఎన్‌జీవో) అధ్యక్షుడు గంప వెంకట్, శ్రీబాలాజీ ట్రస్టు(ఎన్‌జీవో)కు చెందిన ఇద్దరిని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ వి నరేందర్‌రెడ్డి, విద్యావేత్త వై శేఖర్‌రావు, సంగీత దర్శకురాలు, నేపథ్యగాయని ఎంఎం శ్రీలేఖ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మెన్ పెండ్యాల కేశవరెడ్డి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, కార్యదర్శి ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్ పెద్ది విద్యాసాగర్, ఎంజేఎఫ్ చైర్మన్ కొండ వేణుమూర్తి, ఎంజేఎఫ్ ఈవీఎంసీసీ హెచ్ రాజిరెడ్డి, ఎంజేఎఫ్ ఎఫ్‌జీఎల్‌టి కోఆర్డినేటర్ ఇనుగుర్తి రమేశ్,



అంధ విద్యార్థులకు జ్ఞాపికను అందచేస్తున్న గవర్నర్

మిగతా 8వ పేజీలో...

రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు నాలుగు ప్రథమ బహుమతులు సాధించారు. 12 విభాగాల్లో పోటీలు నిర్వహించగా అందులో నాలుగింటిలో కరీంనగర్ విద్యార్థులే విజయం సాధించడం విశేషం. థియేటర్ ఆర్ట్ గ్రూపులో తిమ్మాపూర్ కేజీబీవీ విద్యార్థులు, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్‌లో వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థి క్లాసికల్ సోలో పాటల విభాగంలో, పారమిత విద్యార్థి సంగీత విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. వీరు త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీల్లో పాల్గొంటారు.

రైతు నేస్తం... శాస్త్రవేత్తలతో అనుసంధానం
ఆధునిక సాగుపై అన్నదాతలకు అవగాహన
6

కాంగ్రెస్‌తోనే కర్ర రాజశేఖర్

- ఆశీస్సులు అందించిన సీఎం రేవంత్‌రెడ్డి
- బీజేపీకి నిరాశ
- పనిచేయని 'వెలిచాల' హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో రాజశేఖర్ ప్యానల్ విజయం సాధించి చైర్మన్‌గా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు, ఆశీస్సులు అందజేశారు. రాజశేఖర్‌కు ఆర్థికంగా ఇతరత్రా సహాయసహకారాలు అందించామని, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పరోక్ష తోడ్పాటు కారణంగానే ఆయన ప్యానల్ విజయం సాధించిందని ప్రచారం చేసుకున్న బీజేపీ రాజశేఖర్ ముఖ్యమంత్రిని కలిసి ఆశీస్సులు పొందడంతో నిరాశకు గురైంది.

రాజశేఖర్ ప్యానల్‌లో బీజేపీకి చెందిన వారున్నారని, బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారి సంబంధాలు పెట్టుకొని ఆయన విజయం సాధించాడని, ఆయనపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు. ఆయన అభిప్రాయాన్ని అధిష్ఠానం లెక్కలోకి తీసుకోలేదు. 12 మంది డైరెక్టర్లు ఉండే అర్బన్ బ్యాంకు పాలక వర్గంలో రాజశేఖర్ పోటీలో దింపిన ఇండిపెండెంట్ ప్యానల్‌లో తొమ్మిది మంది గెలుపొందారు. రాజేందర్‌రావు బలపరిచిన ప్యానల్‌లో ఇద్దరు గెలువగా ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించాడు.

రాజశేఖర్ పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే డైరెక్టర్లతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. వారిద్దరిని గెలుపొందిన అభ్యర్థులందరూ మూకుమ్మడిగా వెళ్లి కలవడంతోనే అర్బన్ బ్యాంకు పాలకవర్గం కాంగ్రెస్ పార్టీకి చెందిందని ధ్రువపడింది. ఆ తర్వాత రాజశేఖర్ శుక్రవారం ముఖ్యమంత్రిని కలిసి ఆయన నుంచి అభినందనలు, ఆశీస్సులు అందుకున్నారు.

పలు కీలక పరిణామాలు

రాజశేఖర్ గతంలో రెండుసార్లు అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. ఈ రెండు సందర్భాల్లోనూ ఆయన కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తిగానే ప్రచారం చేసుకొని గెలుపొందారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్నిహిత మిత్రుడైన రాజశేఖర్ ఈసారి ఎన్నికలకు ముందు కూడా ఆయనను కలిసి తాను పోటీచేయాలను కుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ బ్యాంకుకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ అండదండలతో గడ్డం విలాస్‌రెడ్డి చైర్మన్‌గా ఆరునెలలపాటు ఆ పదవిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో విలాస్‌రెడ్డి కూడా మళ్లీ పోటీ చేయడానికి ఆసక్తి చూపుతూ మంత్రి పొన్నంను కలిశారు. అటు విలాస్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలా... రాజశేఖర్‌ను పోటీలో నిలపాలా అన్న విషయం ఆయన ముందుకు రాగా పార్టీ ప్యానల్ ఏదీ లేదని, ఎవరికి వారుగా గెలిచి రమ్మని సూచించడంతో వారిద్దరూ తలో ప్యానల్ పెట్టుకున్నారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు నిర్మల్ భరోసా పేరుతో మరో ప్యానల్‌ను బరిలో నిలిపారు. విలాస్‌రెడ్డి ప్యానల్‌లో ఎవరూ విజయం సాధించలేదు. రాజేందర్‌రావు ప్యానల్‌లో ఇద్దరు మాత్రమే గెలుపొందగా రాజశేఖర్ ప్యానల్‌లో తొమ్మిది మంది విజయం సాధించారు. రాజశేఖర్ ప్యానల్‌లో బీజేపీకి చెందిన ముగ్గురు మాజీ డైరెక్టర్లు పోటీ చేశారు. వీరిలో ఇద్దరు గెలుపొందారు. ఇండిపెండెంట్ ప్యానల్ గానే దీనిని వారు పేర్కొన్నా గెలిచిన తర్వాత బీజేపీ తమ ప్యానల్‌గా భావించి ప్రకటనలు చేసింది. కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఉన్న వెలిచాల రాజేందర్‌రావు రాజశేఖర్‌పై ఫిర్యాదు చేస్తానని విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ప్రకటించారు. అటు మంత్రి పొన్నం ప్రభాకర్, మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు ఆశీస్సులు అందడంతో రాజశేఖర్ కాంగ్రెస్‌లోనే ఉన్నారని, అర్బన్ బ్యాంకు పీఠంపై కాంగ్రెస్ పార్టీ పాలకవర్గం ఏర్పడిందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో జరిగిన ఈ పరిణామం బీజేపీకి, రాజేందర్‌రావుకు షాక్ ఇచ్చినట్లయింది.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్

అన్నవరం ఆలయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల టూర్ ప్యాకేజీలో భాగంగా కరీంనగర్-1 డిపో నుంచి అన్నవరం ఆలయానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ ఐ విజయ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న కరీంనగర్ బస్టాండ్ నుంచి సాయంత్రం 5 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. అన్నవరం, పిఠాపురం శక్తి పీఠం, సింహాచలం, విశాఖపట్నం కైలాసగిరి, బీచ్, ద్వారక తిరుమలలో దర్శనం అనంతరం 13వ తేదీ రాత్రి కరీంనగర్‌కు బస్సు చేరుకుంటుం దన్నారు. ఈ బస్సులో పెద్దలకు 3,500 రూపాయలు, పిల్లలకు 2,625 రూపాయల చార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7382849352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బస్టాండ్‌లో పార్కింగ్ కష్టాలు



బస్టాండ్ ఆవరణలో నిలిపి ఉంచిన వాహనాలు

భగత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల పార్కింగ్ కష్టాలు వర్ణనాతీతం. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కరీంనగర్ బస్టాండ్‌లోకి వాహనాలతో ప్రవేశించాలంటేనే ప్రజలు నానా పాట్లు పడాల్సి వస్తున్నది. బస్టాండ్‌లోకి ప్రవేశిస్తే చాలు పెయిడ్ పార్కింగ్‌తో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. తమకు సంబంధించిన వారిని బస్టాండ్‌లో దించాలన్నా, దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారిని తీసుకు వెళ్లాలన్నా తాము తీసుకు వచ్చిన వాహనాలకు పార్కింగ్ రుసుము చెల్లించాల్సిన పరిస్థితి ఉంది.

బస్టాండ్‌లోకి ప్రవేశిస్తే చాలు ఆర్టీసీ సిబ్బంది వాహ నాన్ని ఎక్కడ పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బస్టాండ్ ఆవరణలో మూడు పెయిడ్ పార్కింగ్‌లు, సిబ్బంది కోసం ఒక పార్కింగ్ స్థలం కేటాయించారు. నిత్యం బస్టాండ్‌లోకి వెళ్లే ప్రయాణికులు తాము తీసుకువచ్చిన వాహనాలను నిలిపేందుకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనా లను నిలుపుతున్నారు. పెయిడ్ పార్కింగ్‌లో 15 నిమిషాల వరకు ఉచితంగా వాహనాలు నిలిపే అవకాశం ఇవ్వాలనే నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ విష యాన్ని పార్కింగ్ యజమానులు సైతం ప్రయాణికులకు తెలపడం లేదు. బస్టాండ్ ఆవరణలో మూడు పెయిడ్ పార్కింగ్‌లు ఏర్పాటు చేసి ఆర్టీసీ సంస్థ పూర్తిగా కమర్షియల్ గా తయారైందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. సాధారణ ప్రజలకు పార్కింగ్ కష్టాలు ఈ విధంగా ఉంటే బస్టాండ్‌లో దుకా ణాలను చేజిక్కించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు మాత్రం తమకు చెందిన వాహనాలను ఏకంగా బస్టాండ్ లోకి తమ దుకాణాల పక్కనే నిలుపుతున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

బస్టాండ్ ఆవరణలో మూడు గేట్‌ల నుంచి వాహనాలను లోపలికి తీసుకువచ్చిన ప్రయాణికులు ఇష్టారాజ్యంగా వాహనాలను నిలుపుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ ఇన్‌గేట్‌లో నుంచి వెళ్తున్న వాహనాలతో పాటు, కార్గో కార్యాలయానికి పార్సిల్స్ తీసుకునేందుకు, పార్సిల్స్ పంపించే వాహనాలతో సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విధంగా ఎక్కడ పడితే అక్కడ నిలిపిన వాహనాలతో పాటు, చాలా రోజులుగా నిలిపి ఉంచిన వాహనాల్లో ఆర్టీసీ సిబ్బంది గాలిని తీస్తున్నారు. సాధారణ వాహనాల కోసం కొంత స్థలాన్ని చూపించి వాహనాలు నిలుపుకునేందుకు అవకాశాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కార్గో లాజిస్టిక్స్ వద్ద





సిరిసిల్ల ప్లాట్ ఫాం సమీపంలో..

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

గన్నేరువరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఇండియన్ బ్యాంకు ముందు నుంచి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో మండల కేంద్రానికి చెందిన మునిగంటి అజయ్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ఆధారంగా వ్యక్తిని కనుగొని శుక్రవారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టును ఢీ కొట్టిన లారీ..

● క్లీనర్‌కు స్వల్ప గాయాలు

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెట్టును లారీ ఢీకొట్టగా, క్లీనర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. పల్లీల లోడ్‌తో అహ్మదాబాద్ నుంచి వరంగల్‌వైపు లారీ వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వజూనియర్ కళాశాల ఎదుట మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టింది. దీంతో క్లీనర్‌కు స్వల్పగాయాలు కాగా, ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైతు నేస్తం..

శాస్త్రవేత్తలతో అనుసంధానం



రైతు నేస్తంలో పాల్గొన్న రైతులు

ఆధునిక సాగుపై అన్నదాతలకు అవగాహన

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం... రైతులతో శాస్త్రవేత్తలను అనుసంధానించే కార్యక్రమం. సాగులో ఆధునిక విధానాలు, పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు చేరువవుతోంది. రెవెన్యూ గ్రామాల్లోని రైతు వేదికల్లో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులనుంచి రైతులు నేరుగా సలహాలను పొందవచ్చు. మండలంలోని చొప్పదండి, ఆర్నకొండ, గుమ్లాపూర్ రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతు వేదికల్లో మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులు హాజరవుతున్నారు. రైతులకు ఒక రోజు ముందే సమాచారాన్ని అందిస్తారు. వీడియో కాన్ఫరెన్సులో అందుబాటులో ఉండే శాస్త్రవేత్తలు, పంటల సాగు, నూతన పంటలపై అవగాహన కల్పిస్తామని రైతులకు సమాచారాన్ని చేరవేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు వేదికల వద్దకు వెళ్లి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని పంటల తెగుళ్లు, ఎదుర్కొంటున్న వ్యాధుల గురించి శాస్త్ర వేత్తలతో మాట్లాడి పరిష్కారం పొందవచ్చు.

వ్యవసాయ అనుబంధ శాఖలు అందుబాటులోకి...

ప్రతి వారం నిర్వహించే కాన్ఫరెన్సులో వ్యవసాయంతోపాటు ఉద్యానవన, మత్స్యశాఖ, పశు సంవర్థకశాఖ, నీటి పారుదలశాఖకు సంబంధించిన అధికారులు, శాస్త్రవేత్తలు అందు బాటులో ఉంటారు. సాగులో అధిక దిగు బడులు పొందేందుకు అవసరమైన సూచనలు, సలహాలు రైతులు పొందవచ్చు. నూతన సాగు విధానాలు, ఆధునిక పద్ధతులు, పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. ఇప్పటికే వ్యవసాయశాఖ రైతుల కోసం వాట్సాప్ ఛానల్‌ను అందుబాటులోకి తీసుకురాగా రైతు ముంగిటకు శాస్త్ర సాంకేతిక రంగాలు చేరాయి.



రైతులు సద్వినియోగం చేసుకోవాలి...

వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి



ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు రైతు వేదికలకు వచ్చి శాస్త్రవేత్తలు, అధికా రుల దృష్టికి సాగు సమస్యలు తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఉద్యానవనశాఖ శాస్త్రవేత్తలు కూడా అందుబాటులో ఉంటారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

కోరుట్ల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన పుల్లవేణి రాజశేఖర్(35) అనే యువకుడు అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లవేణి రాజశేఖర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడసరైన ఉద్యోగం దొరక్క పోవడంతో సంవత్సరం క్రితం స్వగ్రామమైన అయిలాపూర్‌కు తిరిగివచ్చి చికెన్ బిర్యాని సెంటర్ నడుపుతున్నాడు. అదిసరిగా నడవక పోవడంతో మద్యానికి బానిసై రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం సమయంలో గ్రామశివారులోని మల్లన్న గుట్ట సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. రైతులు పోలీసులతో పాటు బంధువులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజశేఖర్‌కు భార్య సంధ్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



సిద్ధార్థ(ఫైల్)

ఇబ్రహీంపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామశివారులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలోపడి పల్లికొండ సిద్ధార్థ (18) అనేయువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మామడ మండలం పోన్కల్ గ్రామానికిచెందిన సిద్ధార్థ ఈనెల6న చేపలు పట్టడానికి మూలరాంపూర్ గ్రామశివారులోని సదర్‌మట్ ప్రాజెక్టుగేట్ నెంబర్ 52 వద్దకు వెళ్లాడు. అక్కడ సిద్ధార్థ వలతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు ముందుకు పడి తలకు బలమైన గాయమై నీటిలో పడి చనిపోయాడు. మృతుడు తండ్రి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

కోనరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు బంగారు పుస్తెలు, ఒక బంగారు ముక్కుపోగు, 4 వెండిమట్టెలు అపహరించారు. గుడిలో పనిచేసే వంకాయల లక్ష్మీరాజం సాయంత్రం గుడికి వెళ్లి చూసేసరికి గుడికి వేసిన తాళం లేదు. లోపలకి వెళ్లి ఆభరణాలు కనిపించలేదు. ముదిరాజ్ సంఘం నాయకుడు తుమ్మల బాబు ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం

● కాపాడి ఆసుపత్రికి తరలించిన పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు



స్వప్నను ఆసుపత్రికి తరలిస్తున్న సీఐ, పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు



స్వప్న(ఫైల్)

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్ కళాశాల రహదారి పక్కన, ఆర్‌టీసీ డిపో వెనుక శుక్రవారం రాత్రి సల్ల స్వప్న(35) అనేవివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంటల్లో కాలుతున్న ఆమె ప్రాణభయంతో అరవడంతో అటుగా వెళుతున్న మెడికల్ విద్యార్థులు, యువకులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, వైద్యకళాశాల విద్యార్థులు చెట్ల పొదల్లో తీవ్రగాయాలతో పడిఉన్న స్వప్నను రక్షించి ఆటోలో గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెపరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. ఆమె సూసైడ్ లెటర్ రాసి బ్యాగులో పెట్టుకుంది. నా చావుకు ఎవరూ కారణం కాదని, రెండు నెలలుగా డిప్రెషన్‌లో ఉన్నానని, ఏ పనిచేయలేకపోతున్నానని, అనారోగ్యంతో బాధపడుతున్నానని, భయం భయంగా ఉందని, నామీద నాకు నమ్మకం లేదంటూ పేర్కొన్నది. వైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని పోతనకాలనీలో సల్ల స్వప్న కుటుంబం నివాసముంటున్నారు. ఆమెభర్త సతీష్ దగ్గరలోని జూలపల్లి ఆదర్శనగర్‌లో కిరాణాషాపు నడుపుకుంటున్నాడు. ఇద్దరు పిల్లలు. మానసి కస్థితి సరిగా లేక రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. స్వప్నను రక్షించి ఆసుపత్రికి తరలించిన సీఐ ఇంద్రసేనారెడ్డి, మెడికల్ కళాశాల విద్యార్థులను పలువురు అభినందించారు.

విషాహారం తిని 36 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ధర్మారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లిలో విషాహారం తిని 36గొర్రెలు మృతిచెందగా 200 గొర్రెల వరకు అస్వస్థతకు గురయ్యాయి. పెర్కపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు గొర్రెల కాపరులు బుధవారం గ్రామంలో కోసిన పంట పొలాల్లో గొర్రెలు మేపేందుకు వెళ్లారు. మందలో రెండు వందలకు పైగా గొర్రెలు ఉండగా కొన్ని సాయంత్రం వరకు అస్వస్థతకు గురయ్యాయి. దీంతో కాపరులు సొంత వైద్యంతో పాటు వెటర్నరీ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి వాడినట్లు సమాచారం. అప్పటికే మందలోని కొన్ని గొర్రెలు తీవ్రఅస్వస్థతకు గురై గురువారం సాయంత్రం మరణించగా, శుక్రవారం ఉదయం మరికొన్ని మరణించాయి. దీంతో ఆందోళనకు గురైన యాదవులు మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన మంత్రి జిల్లా పశువైద్యాధికారి విజయ్ భాస్కర్‌కు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించి అత్యవసర చికిత్స అందించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో గ్రామానికి చేరుకొని చనిపోయిన 36 గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రెండు వందల గొర్రెలకు చికిత్స అందించారు. పోస్టుమార్టంలో కొన్నిగొర్రెలు వడ్లు తిని చనిపోగా మరికొన్ని విషాహారాన్ని తిని మృతిచెందినట్లు పశువైద్య అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నమూనాలను కరీంనగర్‌కు పంపగా అక్కడి నుంచి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు వైద్యులు తెలిపారు. వారంలో రిపోర్టులు వస్తాయని అప్పటివరకు మృతికి గల కారణాలు స్పష్టంగా చెప్పలేమని మండల వైద్యాధికారి అజయ్ తెలిపారు.

మంత్రి ఆదేశాలతో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు సోగాల తిరుపతి, బుట్టి సాగర్ , ఓరెం చిరంజీవి యాదవ సంఘం అధ్యక్షుడు అప్పాల శ్రీను మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు.

సేల్‌డీడ్‌కు రిజిస్ట్రార్ నిరాకరణ

● ఆందోళన వ్యక్తం చేసిన దంపతులు



నిరాకరించిన డాక్యుమెంటుతో తోట శ్రీకాంత్ దంపతులు

గంగాధర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకే అపార్ట్‌మెంటులో బ్యాంకు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేసి అదే అపార్టుమెంటులో మరొకటి సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారిని నిరాకరిస్తూ, చేయరాదంటూ రిజిస్ట్రార్ వెనక్కిపంపించారు. కరీంనగర్ పట్టణ కేంద్రం మారుతీ నగర్‌కు చెందిన తోట శ్రీకాంత్ రేకుర్తి గ్రామంలోని సర్వే నంబరు 80, లేపాక్షి పరివార్ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్‌నెంబరు 304కొనుగోలు చేశాడు. అక్టోబరు 18న సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ కోసం గంగాధర సబ్‌రిజిస్ట్రార్‌కు డాక్యుమెంటు సమర్పించాడు. అయితే శ్రీకాంత్ డాక్యుమెంటును ఈనెల4న డీటీఈపీ నిబంధనలు, జిల్లాకలెక్టర్ చింతకుంట గ్రామానికి సంబంధించిన ఉత్తర్వులను కారణం చూపుతూ నిరాకరించారు. కానీ అదేసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంతకు ముందు అదే అపార్ట్‌మెంటు, అదేసర్వే నంబర్ సంబంధించిన మార్టిగేజ్(బ్యాంకు టైటిల్ డీడ్ డిపాజిట్) లావాదేవీలను రిజిస్టర్ చేశారని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆ ఆస్తిపై ఎటువంటి నిషేధ ఉత్తర్వులు లేవని, చట్టబద్ధమైన బదిలీని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఉత్తర్వులు నిజంగా నిషేధిస్తున్నాయంటే అదేఆస్తికి బ్యాంకు మార్టిగేజ్ ఎలా అంగీకరించబడింది, సేల్‌డీడ్‌కు నిరాకరిస్తూ మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లను అనుమతించడం ఎలా సాధ్యమని శ్రీకాంత్ పేర్కొన్నారు. రేకుర్తి గ్రామంలోని లేపాక్షి పరివార్ ఎటువంటి నిషేది జాబితాలో లేదని అటువంటి పరిస్థితిలో తన ప్లాటును నిరాకరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరిస్తూ చట్టపరమైన నిషేధ ఉత్తర్వులు లేకుండా రిజిస్ట్రేషన్లను నిరాకరించడం రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్71,72లకు వ్యతిరేకమని ఆయన అన్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ వద్ద అప్పీల్‌కు దాఖలు చేస్తామని తెలిపారు.

రుణం చెల్లించాలని ఇంటికి తాళం

● రోడ్డున పడ్డ వృద్ధ దంపతులు



రోదిస్తున్న వృద్ధ దంపతులు

వేములవాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై తీసుకున్న రుణం తాలూకు బకాయిలు చెల్లించడం లేదని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ వారు ఇంటికి తాళం వేయడంతో ఆ ఇంటినే నమ్ముకుని జీవిస్తున్న వృద్ధ దంపతులు రోడ్డున పడ్డారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లారం గ్రామానికి చెందిన మల్లారం రాజయ్య, పోశవ్వకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన మల్లారం శ్రీనివాస్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఇంటిని తాకట్టు పెట్టి రూ.14లక్షల రుణం తీసుకున్నాడు. సంవత్సరకాలంగా ఎలాంటి వాయిదాలు చెల్లించలేదు. తీసుకున్న బకాయిలు చెల్లించాలని సంస్థ వారు పంపిన నోటీసులకు సమాధానం లేకపోవడంతో సదరు సంస్థ వారు కోర్టును ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం ఇంటి సామాను బయటవేసి ఇంటికి తాళంవేశారు. తాము నివాసముం టున్న ఇంటికి తాళం వేయడంతో దిక్కుతోచని స్థితిలోఉన్న రాజయ్య పోశవ్వలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. చిన్నకుమారుడు శ్రీనివాస్ ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందిం చకపోవడంతో ఇంటిపరిసరప్రాంతాలలో తలదాచుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న రాజయ్య పోశవ్వ దంపతుల పరిస్థితి స్థానికులను కలిచివేస్తోంది.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, లక్ష్మీపూర్, లింగన్నపేట, ముచ్చర్ల గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ఇద్దరు అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా లింగాపూర్ తండాలో బైండోవర్ ఉల్లంఘన కింద ఒకరికి జరిమానా విధించినట్టు వెల్లడించారు.

పొలంలో కొండచిలువ

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్‌లో పొలంలో కొండచిలువ కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్‌లో ఓ రైతు తనపొలంలో హార్వెస్టర్‌తో వరికోయిస్తున్నాడు. ఈక్రమంలో కొండచిలువ హార్వెస్టర్ బ్లేడుకు తగిలి డ్రైవర్‌కు కనిపించింది. డ్రైవర్, సమీప రైతులు పొలం నుంచి కొండచిలువను బయటకు తీసుకువచ్చేసరికి మృతిచెందినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వెన్నంపల్లి విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సైదాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ 2025లో రాష్ట్రస్థాయిలో ప్రథమబహుమతి పొంది జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోద్యాయుడు రాయి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డోలువాయిద్యం పోటీలలో అమరగొండ రోహిత, అమరగొండ అశ్వర్థ్, వెంగల ఆశీష్‌వర్ధన్ చిగుర్ల రిత్విక్‌లు హైదారాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచి పుణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యార న్నారు. ఎంపికైన విద్యార్థులకు, వారికి తర్ఫీదు ఇచ్చిన పీడీ జ్యోతికి ప్రధానోపాధ్యాయుడు రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శుభా కాంక్షలు తెలిపారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం ధాన్యం లోడుతో వెళుతున్న లారీ తగిలి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. కరెంటు సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. ధాన్యం లోడుతో బయలుదేరిన లారీ కరెంటు తీగలు అడ్డుగా ఉండడంతో గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడిపించాడు. దాంతో కరెంటు స్తంభం విరిగిపోయింది. సమాచారం అందుకున్న 'సెస్' సిబ్బంది మరమ్మతు చేపట్టారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోయినపల్లి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. రేకుర్తిగ్రామానికి చెందిన కోట పోచయ్య, బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన నల్లగొండ రాకేష్ రేషన్ కార్డుదారుల వద్ద నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలుచేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. సుమారు 4క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా లేదా అమ్మకానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామ సమీపంలోని ముస్కుపల్లి వాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి పట్టుకొని డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో రౌడీషీటర్లు ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వన్‌టౌన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా నేరాలను ప్రోత్సహించినా, గొడవలు, దాడులు, బెదిరింపులకు దిగినా కఠినచర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీయాక్టు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐలు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్..

మంథని: పోలీసు సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ కార్యాలయంలో సీఐ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరిపై నిఘా ఉందన్నారు. ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. ఎస్‌ఐ రమేష్ ఉన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు బాల్య వివాహాలను సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం మండలంలోని ఓ గ్రామంలో రెండు వేర్వేరుచోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయనే సమాచారంతో జిల్లా కేంద్రానికి చెందిన అధికారులు పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఒకచోట పెళ్లికి సిద్ధంగా ఉన్న జంట పారిపోయారు. మరోచోట అధికారులు వెళ్లేసరికే పెళ్లి జరిగిపోయింది. అయితే పెళ్లిజరిగిన జంటకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి విచారణ జరుపుతున్నారు. పారిపోయిన జంటను శనివారం తమ ఎదుట హాజరు పరచాలని ఇరువురి తల్లిదండ్రులను ఆదేశించారు.

రాజన్న సన్నిధిలో భక్తుల సందడి



కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

వేములవాడ టౌన్, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేముల వాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తజనసందడి నెలకొంది. శుక్రవారం వేలాది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్న సన్నిధిలో భక్తులు స్వామివారిని లఘుదర్శనం చేసుకున్నారు. శ్రీభీమేశ్వరాలయంలో కోడెమొక్కులు చెల్లించి అర్జిత సేవలైన కళ్యాణం, సత్య నారాయణ వ్రతం, కుంకుమపూజలు, అభిషేకాలు, అన్న పూజలు, మహాలింగార్చనలు, పల్లకి సేవలు, ఆకుల పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరస్వామివారి కళ్యాణ మండపంలో కార్తీక పురాణ ప్రవచనం నిర్వహించారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా కార్తీకదీపోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి సుహాసినిలచే కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్

- యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
- విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
- 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు... 161 మందికి బంగారు పతకాలు


ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కరీంనగర్ టౌన్/గణేష్‌నగర్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందు కెళ్లాలి' అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాతవాహన యూనివర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్, ఛాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయ పథం దిశగా తీసుకెళుతుందన్నారు. విద్యార్థుల మేధాశక్తే వారి ప్రయోగశాల అని అభివర్ణించారు.

విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయన్నారు. శాతవాహన విశ్వ విద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యారంగం సాంకేతికతతో ముందుకు సాగుతోందని, బోర్డు, చాక్‌పీస్‌లకే పరిమితం కావద్దని అన్నారు. డిజిటల్ లర్నింగ్, భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని చెప్పారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసాలు విద్యార్థి విజయానికి దోహద పడతాయని తెలిపారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని గవర్నర్ అన్నారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని, అలసటను అధిగమించి ముందుకు సాగాలన్నారు. కృషితో ప్రతి విద్యార్థి అభివృద్ధి సాధ్యమేనన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

'శాతవాహన' ప్రస్థానం స్ఫూర్తిదాయకం

ప్రొఫెసర్ బీజే రావు, హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ



ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారు. రెండు దశాబ్దాల కంటే తక్కువ వ్యవధిలో ఈ సంస్థ తెలంగాణాలోని ఉత్తర ప్రాంతంలో అభ్యాసానికి, ఉన్నత విద్యకు కీలకమైన కేంద్రంగా మారిందని అన్నారు. ఆరు సంవత్సరాల్లో విశ్వ విద్యాలయంలో 1,03,454 మంది అండర్ గ్రాడ్యుయేట్లలో 55,000 మందికి పైగా విద్యార్థులు పట్ట భద్రులయ్యారని, 34,561 మందిలో 25,310 మంది పీజీ డిగ్రీలను సొంతం చేసుకున్నారన్నారు.

కొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నాం

ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్, 'శాతవాహన' వీసీ



శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 156 కళాశాలలు యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులను అందిస్తున్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. ఎం ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీటెక్ కోర్సులు ప్రారంభించామని చెప్పారు. వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత బయోమెట్రిక్ హాజరు అమలు చేశామని, విద్యార్థుల భద్రత కోసం 100 కెమెరాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, కలెక్టర్ పమేలా సత్పతి, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

● ఈ సందర్భంగా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన 25 మందికి డాక్టరేట్ పట్టాలను, 2018 నుంచి 2023 వరకు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలను గవర్నర్ అందజేశారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం... పోలీసు గౌరవ వందనం

కరీంనగర్‌కు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అధికారులు ఘనస్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు రావలసిన గవర్నర్ 15 నిమిషాల ముందే యూనివర్సిటీకి చేరుకున్నారు. పరిపాలన విభాగం భవనం ముందు పోలీసులు ఆయనకు గౌరవందనం సమర్పించగా, వీసీ ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.



హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అధికారులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యం..: నర్మద


నేను అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదివాను. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాను. నన్ను ప్రోత్సహించిన తెలుగు హెచ్‌వోడీ లక్ష్మీనారాయణ సార్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు. నాలుగు బంగారు పతకాలు అందుకోవడం సంతోషాన్నిచ్చింది.

ఇదే స్ఫూర్తితో ముందుకుసాగుతా.. : అమరనంద


మాది ధర్మారం రాజారాంపల్లి. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం ఆనందాన్నిచ్చింది. ఈ గోల్డ్ మెడల్స్ సాధించడానికి ప్రోత్సాహం ఇచ్చిన తెలుగు డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు లక్ష్మీనారాయణకు రుణపడి ఉంటాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు కొనసాగిస్తాను.

అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతో.. కామినేని సాయిచరిత్ర


నేను వివేకానంద డిగ్రీ, పీజీ, కళాశాలలో ఎంబీఏ హెచ్‌ఆర్ చదువుకున్న. రెండు గోల్డ్ మెడల్స్ సాధించా. మా అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

నా కష్టానికి ఫలితం దక్కింది..: వసీమా


నేను ఎంబీఏ ఫైనాన్స్ చదువుకున్న. నాకు చిన్నప్పటి నుంచి ఇష్టపడి చదవడం అలవాటు. అలా చదవడం వల్ల ఈ రోజు బంగారు పతకం సాధించా. చాలా సంతోషంగా ఉంది. నా కష్టానికి ఫలితం దక్కింది.

రెండు బంగారు పతకాలు సాధించాను: బూర నవీన్


మాది వేములవాడ మండలం మారుపాక. ఎంఏ సోషియాలజీ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించాను. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అభినందనలతో ముంచెత్తారు.

సంతోషంగా ఉంది.. కాల్వ వెంకటేశ్


ఎంబీఏ మార్కెటింగ్ 2017-19 సంవత్సరంలో చదువుకున్నా. నేను పేద కుటుంబం నుంచి వచ్చాను. రూరల్ బ్యాక్ గ్రౌండ్ అయినా కష్టపడి చదివి నేను అనుకున్నది సాధించాను. దీనికి మా తల్లిదండ్రులు, అధ్యాపకులే ప్రధాన కారకులు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం ఆనందంగా ఉంది.

తల్లిదండ్రులకు, గురువులకు కృతజ్ఞతలు: కొండ ప్రవళిక


మాది రాయికల్ మండలం మూటపల్లి గ్రామం. శాతవాహన యూనివర్సిటీలో 2019లో ఎంఏ తెలుగు పూర్తి చేశాను. ప్రాచీన సాహిత్యంలో నాకు గోల్డ్ మెడల్ వచ్చింది. ఇందుకు సహకరించిన గురువులకి, తల్లిదండ్రులకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రోత్సాహాన్నిచ్చింది.. తౌటం సునిల్


రంగాపూర్ గ్రామానికి చెందిన నేను అర్థశాస్త్రంలో బంగారు పతకం సాధించాను. పతకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. నా కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. నా భవిష్యత్తుకు ప్రోత్సాహాన్నిచ్చింది.

అమ్మ నాన్నల చేతుల మీదుగా అందుకుంటే బాగుండేది.. : మోడెం క్రాంతికుమార్


ఖమ్మం జిల్లాకి చెందిన నేను ఎంఏ సోషియాలజీ విభాగంలో బంగారు పతకాన్ని సాధించాను. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. అమ్మనాన్నల చేతుల మీదుగా అందుకుంటే మరింత సంతోషంగా ఉండేది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..: స్పందన


కెమిస్ట్రీ విభాగంలో నాకు బంగారు పతకం రావడానికి మా తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడింది. వారికి, శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రస్తుతం టీచింగ్ ఫీల్డ్‌లో ఉన్నాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత విజయాలు సాధిస్తా.

గొప్ప అనుభూతి.. డాక్టర్ జమున, పీహెచ్‌డీ స్కాలర్


నేను జగిత్యాల ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలుగా పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకోవడం ఆనందంగా ఉంది. ఇది నాకు గొప్ప అనుభూతి. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.. డాక్టర్ ఫాతిమా సుల్తానా, పీహెచ్‌డీ స్కాలర్


నేను మానకొండూరు మండలం పోచంపల్లి మోడల్ స్కూల్లో పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.

యూనివర్సిటీకి కృతజ్ఞతలు డాక్టర్ ఎన్ మాల్లారెడ్డి, పీహెచ్‌డీ స్కాలర్


పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉంది. 2023లో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసినందుకు నాకు ఈ రోజు పట్టా ఇచ్చారు. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

తోటి గిరిజన తెగపై పరిశోధన చేశా.. డాక్టర్ మరక శ్రీనివాస్, పీహెచ్‌డీ స్కాలర్


గిరిజన తెగల్లో అతి తక్కువ జనాభా ఉన్న తోటి గిరిజన తెగపైన పరిశోధన చేశా.. గవర్నర్ చేతుల మీదుగా పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ పరిశోధనకు సహకరించిన గురువు వన్నాల రమేష్‌కు, కుటుంబ సభ్యులందరికి కృతజ్ఞతలు.

కొనసాగుతున్న జోనల్‌స్థాయి ఆటల పోటీలు


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో 11వ జోనల్‌స్థాయి ఆటల పోటీలలో భాగంగా శుక్రవారం రెండోరోజు పోటీలు కొనసాగాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో క్యారమ్ డబుల్స్‌లో మానకొండూర్ ప్రథమ, దుబ్బాక ద్వితీయ, చెస్‌లో దుబ్బాక ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-17 విభాగంలో కబడ్డీలో కోహెడ ప్రథమ, చేర్యాల ద్వితీయ, క్యారమ్ డబుల్స్‌లో హుస్నాబాద్ ప్రథమ, ముస్తాబాద్ ద్వితీయ, చెస్‌లో ముస్తాబాద్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-19విభాగంలో ఖోఖోలో మానకొండూర్ ప్రథమ, కోహెడ ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో మానకొండూర్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయ, చెస్‌లో కోహెడ ప్రథమ, అల్వాల్ ద్వితీయ స్థానాలు సాధించాయి.

వైభవంగా గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న వేదపండితులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, హరినామ సంకీర్తనలతో గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సుధగోని లహరి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం సిరిసిల్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో లహరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు తడకల సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద మాటాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లహరి చదువుతో పాటు ఆటల్లో రాణిస్తోందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు ఖమ్మం జిల్లా పినపాక మండలం బయ్యారంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు నుంచి లహరి పాల్గొంటుందని తెలిపారు.


లహరికి మెమొంటోను అందిస్తున్న హెచ్‌ఎం శారద

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి వంకాయల నందన్‌సాయి ఎంపికయా డు. విద్యార్థి వంకాయల నందన్ సాయిని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఆర్చరీ కోచ్ మహేందర్, హరీష్, భారతి విద్యాలయం పాఠశాల కరస్పాండెంట్ రామ్‌రెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణాకర్ శుక్రవారం అభినందించారు.

తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రం కొత్తపల్లి లోని అల్ఫోర్స్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వంకాయల నందన్‌సాయి ఇండియన్ రౌండ్‌లో ప్రథమస్థానంలో నిలిచి ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9న రంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో జరిగే పోటీల్లో నందన్‌సాయి ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొననున్నారు.


నందన్ సాయి

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం శుక్రవారం తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మోయతుమ్మెద వాగునుంచి 3,282 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా, రెండు గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 254 క్యూసెక్కులు మొత్తం 4,254 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

అట్టహాసంగా జాతీయస్థాయి కరాటే పోటీలు ప్రారంభం

- హాజరైన సినీ హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ హీరో, కరాటే లెజెండ్ డాక్టర్ సుమన్ తల్వార్ ప్రారంభించారు. కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా నేషనల్ అకాడమీ చీఫ్ ఇ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో దేశవ్యాప్తంగా 1200 మంది క్రీడాకారులు పోటీ పడనున్నారు. ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ కరాటే ప్రపంచంలోనే నంబరువన్ క్రీడగా అవతరించిందని, ఎక్కువ దేశాల్లో కరాటేకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతన్నారు.

ఈరోజుల్లో అమ్మాయిల మీద జరుగుతున్న సంఘటనలు తనను చాలా బా ధించాయని, కరాటే నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. మలేషియా గ్రాండ్ మాస్టర్ అనంతన్, టోర్నమెంట్ చీఫ్ అడ్వయిజర్ రవీందర్ కుమార్, వసంత్ కమార్, సురభి వేణుగోపాల్, గౌరు రాజిరెడ్డి, ఐలయ్య, మొండయ్య, మన్నన్, ఆర్గనైజర్ మాడుగుల ప్రవీణ్, ప్రసన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ హీరో సుమన్, పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఐదు దశాబ్దాలుగా ఎన్టీపీసీ వెలుగులు

- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత - ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

జ్యోతినగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా దేశానికి వెలుగులను అందిస్తూ ప్రపంచ అగ్రగామి సంస్థగా ఎన్టీపీసీ వెలుగొందుతోందని రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. దేశాభివృద్ధికి ఎన్టీపీసీ చేయూతనందిస్తోందన్నారు. పారిశ్రామిక, గృహ అవసరాలకు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలో నాలుగో వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ సంస్థ నిరంతరాయంగా అందిస్తోందన్నారు. ఎన్టీపీసీ సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయాలని ఆయన కోరారు. విద్యుత్పత్తితోపాటు సామాజిక అభివృద్ధికి ఎన్టీపీసీ కృషి చేస్తోందన్నారు. ఎన్టీపీసీ కాకతీయ ఆడిటోరియం, ఈడీ రెసిడెన్షియల్ ఏరియాలో మాస్ ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందన్‌కుమార్ ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈడీ కేక్ కట్ చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఈడీ చందన్ కుమార్, అధికారులు

సామూహిక వందేమాతరం గీతాలాపన


వీణవంకలో వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థులు


ఇల్లందకుంటలో..


కరీంనగర్‌లో ఎక్సైజ్ పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాల్లో, ప్రధాన కూడళ్లలో గీతాలాపన చేశారు. కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది వందేమాతరం ఆలపించారు. కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్-1 డిపోలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్ విజయ మాధురి, ప్రసన్నకుమార్, తిరుపతి, కిషన్ పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఆలపించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులు పాఠశాలకు భరతమాత చిత్రపటాన్ని అందజేశారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: నగరంలోని కోరా జాన్సన్, ఏఎన్‌సీ పాఠశాలల్లో చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోషరెడ్డి వందేమాతరం ఆలపించారు.

మానకొండూర్: మానకొండూర్‌లో వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, పోలీసుస్టేషన్‌లో పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు సామూహికంగా ఆలపించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, పలు సంస్థలతోపాటు నాగార్జున డెయిరీలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహికంగా వందేమాతర గేయం ఆలపించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వందేమాతరం 150 వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పలు శాఖల అధికారులు వందేమాతరం ఆలపించారు.

వీణవంక: మండల కేంద్రంలో బస్టాండ్ చౌరస్తాలో విద్యార్థులు, ప్రజలు సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు పులి అశోక్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్ పాల్గొన్నారు.


హుజూరాబాద్ నాగార్జున డెయిరీలో..

● సంక్షిప్తంగా..

ప్రశ్నించడం అలవర్చుకోవాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిల్లలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని, మూఢ నమ్మకాలను నమ్మకుండా ప్రశ్నించడం అలవర్చుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కేశవరెడ్డి, జిల్లా బాధ్యులు దేవేందర్, సంపతి, రమేశ్, ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక జిల్లాశాఖ చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఓల్డ్ హైస్కూల్‌లో పరీక్ష నిర్వహించారు.

చెకుముకి పరీక్షలు

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ జడ్పీ ఉన్నతపాఠశాలలో చెకుముకి సైన్స్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 69మంది విద్యార్థులు హాజరవగా ముగ్గురు విద్యార్థులు విక్కీ, రిషిత, శ్రీహర్షిత్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు.

గ్యాస్ స్టవ్ అందజేత

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు ఒరుగుల శేఖర్ ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్‌స్టవ్‌ను, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను అందజేశారు. విద్యాలయానికి చెందిన కుక్ బైరి పుష్పలత తన మనవడి జన్మదినం సందర్భంగా పాఠశాల, అంగన్‌వాడీలో ప్లేట్లను అందజేశారు.

మొబైల్ వినియోగంపై అవగాహన

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు మొబైల్ వినియోగంపై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ వేణుమాధవ్ మాట్లాడుతూ చదువుతున్నప్పుడు ఫోన్‌లు వాడకంతో ఏకాగ్రత తగ్గుతుందన్నారు. ప్రిన్సిపాల్ ముంజాల సంగీత పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన

తిమ్మాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీ భవితకేంద్రాన్ని డీఈఎల్ఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న 32 మంది ఛాత్రోపాధ్యాయులు శుక్రవారం సందర్శించారు. ముందు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. బోధన, బోధనోపకరణాలపై తెలుసుకున్నారు. ఐఆర్పీలు గణేష్, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్‌పోటీలు

వీణవంక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీసాట్, ప్రధానోపాధ్యాయులు సంఘం ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు మండల స్థాయిలో నిర్వహించారు. క్విజ్ మొదటి పదిస్థానాల్లో నిలిచిన, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఎంఈవో శోభరాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఎంఈవో మోహన్ బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు జలీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళా సిల్క్ ప్రదర్శన


చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరాజరాజేశ్వర కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. దేశంలో పది రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత దస్తుల అమ్మకాలతోపాటు స్టోన్, జువెల్లరీస్, కుర్తా, డ్రెస్ మెటీరియల్, డోర్ కర్టన్స్, పెరల్స్, ఉడెన్ హ్యాండ్ క్రాఫ్ట్, బంజారా కోల్‌కత్తా బ్యాగ్స్, జైపూరీ రాంజీ, ఒరిస్సా హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువులు ఈ ప్రదర్శనలో లభిస్తాయి. గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, ఉత్తరప్రదేశ్ జామ్‌దాని, బనారస్, లక్నో డ్రెస్‌మెటీ రియల్, రాజస్థాన్ కోట, బందన్, బ్లాక్ ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్‌మెటీరియల్, కర్నాటకలోని క్రేస్, ప్రింటెడ్ చీరెలు, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి, జమ్ముకాశ్మీరులోని ఎంబ్రాయిడరీ చీరెలు, పాస్మిన్ శాల్, డ్రెస్‌మెటీరియల్, ఆంధ్రప్రదేశ్ లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పడ చీరెలు, అస్సాంలోని మూగా, ఎరిశిల్ట్, బీహార్‌లోని బాగల్పూర సిల్క్, ట్రస్సర్, చత్తీస్‌ఘడ్‌లోని ట్రిబుల్ వర్క్, కోన సిల్క్ చీరెలు, గుజరాత్‌లోని బందాని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్‌తోపాటు చీరెలు, నేతన్నలు నేసిన చీరెలను ఈ స్టాల్స్‌లో ప్రదర్శన, అమ్మకాల కోసం అందుబాటులో ఉంచారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ అభినందనీయం


అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత రమేష్ రెడ్డి

గణేశ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంగారు పతకాలు అందుకున్న శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి అన్నారు. శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సంలో శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అనంతరం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవంలో కరీంనగర్ శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు 6 బంగారు పతకాలు అందుకున్నారన్నారు. విద్యార్థులు పరీక్షల్లోనే కాకుండా సమాజంలోనూ ఉన్నత స్థానంలో ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు.

బంగారు పతకాలు అందుకున్నవారిలో పి.శ్రీనివాస్, జవేరియా సుల్తానా, కొండమీది సాయిప్రసన్న, తోడేటి శ్వేత (రెండు విభాగాలు), సైదా సిద్దిఖ్వ హమేది ఉన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్‌లు కృష్ణారెడ్డి (బీ.ఎడ్), డాక్టర్ వి.స్వర్ణలత (ఉమెన్స్) పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం విద్యార్థికి గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకుంటున్న సందీప్

భగత్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఎస్ఆర్ఎం కళాశాల విద్యార్థి చెవ్వల సందీప్ శుక్రవారం గోల్డ్ మెడల్ అందుకున్నారు. యూనివర్సిటీ పరిధిలో మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లో అత్యధిక మార్కులు సాధించినందుకు గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా సందీప్‌ను కళాశాల చైర్మన్ ఎం.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు, ఎంబీఏ హెచ్‌వోడీ డాక్టర్ ఎండీ ఖ్వాజా మొయినొద్దీన్ అభినందించారు.

సారూ.. ఈ రోడ్డును పట్టించుకోరూ..

● రోడ్డుకిరువైపులా కొట్టుకుపోయిన మట్టి ● తుమ్మల చెరువు కట్టకాలువ తెగడంతో దుస్థితి ● మరమ్మతు చేపట్టాలని గ్రామస్థుల విజ్ఞప్తి


మట్టి కొట్టుకపోయి ప్రమాదకరంగా మారిన ఘనపూర్ రోడ్డు

సైదాపూర్,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో వెన్కేపల్లి తుమ్మల చెరువు కట్టుకాలువ గండి పడి నీరంతా సైదాపూర్ సమీపంలో ఘనపూర్ రోడ్డుపై నుంచి ప్రవహించడంతో రోడ్డుకిరువైపులా మట్టి కొట్టుకపోయి ప్రమాదకరంగా మారింది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా భారీ వాహనం వస్తే రోడ్డు దిగలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ తప్పనిసరై దిగితే వాహనం ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ఘనపూర్, ఆకునూర్‌లలో గ్రానైట్ క్వారీలుండగా నిత్యం లారీలు పెద్దపెద్ద బండరాళ్లతో వెళ్తుంటాయి. అలాగే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు కూడా వెళ్తుంటాయి. ఏదైనా వాహనం వచ్చినప్పుడు ఎదురుగా వచ్చిన వాహనాలు రోడ్డు దిగాల్సిన పరిస్థితి ఉంటోంది. కానీ రోడ్డు దిగడానికి వీలు లేకుండా పక్కనున్న మట్టి కొట్టుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, రోడ్డు పక్కన మట్టిపోసి రాకపోకలను సులభతరం చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల క్రీడా సమైక్య ఆధ్వర్యంలో నవంబరు 8నుంచి 10వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడికల్‌లో పదోతరగతి చదువుతున్న భూస అర్చన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, సీనియర్ ఉపాధ్యాయిని రజిని తెలిపారు. గత నెల ఉమ్మడిజిల్లా సిరిసిల్లలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

26న ఢిల్లీలో రాజ్యాంగ హక్కుల సాధన సభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 26న జరిగే రాజ్యాంగ హక్కుల సాధన సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకుడు తొగరు స్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని, దళితులపై దాడులు అరికట్టి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నాయకులు జూపాక శ్రీనివాస్, సొల్లు బాబు, సమ్మయ్య, రమేష్, సదానందం, దశరథం, నరసింగం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో ఆనందం

భగత్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): టీసాట్, టీఎస్‌జీహెచ్ఎంఏ సంయుక్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో కొత్తపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బహుమతులు సాధించారు. వ్యాసరచన పోటీల్లో కొత్తపల్లికి చెందిన వి.సహస్ర మొదటి బహుమతి, ఎలగందల్‌కు చెందిన జి.నర్సింహారాజు రెండో, ఎలోక్యూషన్‌లో ఆసిఫ్‌నగర్ విద్యార్థికి డి.లక్ష్మి స్లోకకు మొదటి, కొత్తపల్లికి చెందిన ఎన్.అక్షయకు రెండో, క్విజ్‌లో కొత్తపల్లికి చెందిన కుతిజా బేగంకు మొదటి, ఎలగందల్‌కు చెందిన ఇ.రమ రెండో బహుమతి సాధించారు. పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులను ఎంఈవో ఆనందం, టీఎస్ఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జీహెచ్ఎంలు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, దామోదర్, సీఆర్‌పీ పర్శరాయి, నీలోఫర్ అభినందించారు.

బీసీ రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం

గణేశ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం సాగిస్తామని బీసీ సంఘాల నాయకులు అన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు బీసీ జేఏసీ నాయకులను శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని అరెస్టులతో ఆపలేరని, మరింత ఉధృతం చేస్తామని అన్నారు. బీసీ జాక్ నాయకులు కేసిపెద్ది శ్రీధర్ రాజ్, ఆది మల్లేశం, ఎన్నం ప్రకాష్, నర్సింగోజు శ్రీనివాస్, నాగుల కనుకయ్య గౌడ్,పెంట అజయ్ పటేల్, సంజీవ్, శ్రీధర్, రాచమల్ల రాజు, కాసా రాజు, నితిన్ ఉన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంటలో బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్, రితీష్, మధుకర్, రాజేందర్, కౌశిక్, రాజు, తిరుపతి, సాయి, గోవర్ధన్, రవీందర్, శ్రావణ్, హరికృష్ణ, రమేష్, వినయ్ ఉన్నారు.



మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకులు

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

(5వ పేజీ తరువాయి)

ఎంజేఎఫ్ రీజియన్ చైర్‌పర్సన్ వడకాపురం జగదీశ్వరాచారిని గవర్నర్ సన్మానించారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, కలెక్టర్ పమేలాసత్పతి, సీపీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజి వాఖడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, కరీంనగర్ ఆర్‌డీవో మహేశ్వర్, హుజూరాబాద్ ఆర్‌డీవో రమేశ్‌బాబు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రముఖులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

● గవర్నర్ పర్యటనకు 300 మందితో బందోబస్తు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటను శుక్రవారం ప్రశాతంగా ముగిసింది. శాతవాహన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి గవర్నర్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ రెండు చోట్ల గవర్నర్ కార్యక్రమాలకు హాజరవుతుండడంతో పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఒక అడిషనల్ డీసీపీతోపాటు ఆరుగురు ఏసీపీలు, సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, ఇతర సిబ్బంది కలిసి 300 వరకు బందోబస్తుకు వినియోగించారు. శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద వేదిక, కలెక్టరేట్‌లో ఆడిటోరియం ప్రాంతాలను గురువారం సాయంత్రం నుంచే డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేసి, సాయుధ పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. గవర్నర్ రోడ్డు మార్గంలో ఎన్టీఆర్ చౌక్ నుంచి మానేరు బైపాస్ రోడ్డు, చింతకుంట ద్వారా శాతవాహన విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. అక్కడ కార్యక్రమం ముగిసిన తరువాత మధ్యాహ్నం కలెక్టరేట్‌కు చేరుకుని సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగివెళ్లారు. గవర్నర్ పర్యటన సందర్భంగా కొందరు బీసీ సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేసే అవకాశముందనే సమాచారంతో 19 మంది బీసీ సంఘ నాయకులను గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని పీటీసీకి తరలించి మధ్యాహ్నం తరువాత వదిలిపెట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రైవేట్ కళాశాలల సంఘాలు సమాయత్తమవుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు వారిని వారించినట్లు తెలిసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 10:30గంటల వరకు హుజూరాబాద్ పట్టణం మొత్తం విద్యుత్‌నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వీణవంక: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్, వీణవంక, రామకృష్ణాపూర్, లస్మక్కపల్లి, కనపర్తి, రెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, శ్రీరాములపేట, అచ్చంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌తో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1-30గంటల వరకు కరెంటు నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌అధికారులు తెలిపారు. పోతిరెడ్డిపల్లి హిమ్మత్ నగర్ కొండపాకలో ఉదయం 10నుంచి 11-30గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

అజ్మీర్ దర్గాలో యువజన కాంగ్రెస్ నాయకుడి ప్రార్థన

కరీంనగర్ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి రావాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా కిమ్ ఫహద్ మాట్లాడుతూ అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి బీసీ, ఎస్సీ, మైనార్టీ, విద్యార్థి సంఘాలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారన్నారు. పార్టీలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా ముందుకెళ్తున్నారన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం రావాలన్న, అన్ని రకాలుగా మేలు జరగాలన్న నరేందర్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో జాతీయ సేవా సంస్థ విభాగం, సూక్ష్మ జీవ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మాలతి, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు


జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి

భగత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి తిరుపతి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిర్భావం నుంచి నేటి వరకు దేశంలోనే అతిపెద్ద యువజన సంఘంగా రూపుదిద్దుకుందన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్నట్లు చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్, రవీందర్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో పతకాలు తెచ్చిన క్రీడ హాకీ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశానికి ఒలింపిక్స్‌లో పతకాలు తెచ్చిన క్రీడగా హాకీకి ప్రత్యేక గుర్తింపు ఉందని మాజీ మేయర్, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌సింగ్ అన్నారు. జాతీయ హాకీ అసోసియేషన్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శతాబ్ది వేడుకలను నిర్వహించారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు సురేందర్‌సింగ్, కళ్యాణి సురేందర్‌సింగ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ డీఎస్పీ మృతి

వీణవంక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ గడ్డ రామస్వామిగౌడ్(76) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక ఎస్సై తిరుపతి నివాళులు అర్పించారు. వీణవంకలో నిర్వహించిన రామస్వామి అంత్యక్రియల్లో బ్యాచ్ మేట్స్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కమిషనర్‌కు వినతి

కరీంనగర్ రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు ఆరెపల్లిలో కొందరు నాయకుల అండ దండలలో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని శుక్రవారం ఆరపల్లి డివిజన్‌కు చెందిన బారి జితేందర్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందించారు. సర్వే నంబరు 120లో డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద రెండు గుంటల భూమి కబ్జా చేశారని, ఆ భూమిలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమిని అమృత్ ట్యాంక్ నిర్మాణానికి కేటాయించారని. ట్యాంకుల నిర్మాణాలు కూడా జరుగుతోందని తెలిపారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో శుక్రవారం టీఎస్‌జీహెచ్ఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు సమ్మిరెడ్డి, ఖైరున్నిసాబేగం, టీఎస్‌జీ హెచ్ఎంఏ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ రైతు అవార్డు అందుకున్న సిర్సపల్లివాసి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లికి చెందిన ఆదర్శరైతు వంగల వెంకట్‌రెడ్డి ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ వరిపరిశోధన సంస్థ కార్యాలయంలో శుక్ర వారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఏఆర్ డైరెక్టర్ సమన్‌రావు, అటరీ డైరెక్టర్ శేఖర్‌మీర, ప్రిన్సిపాల్ ఎంఎస్ ప్రసాద్, సైంటిస్ట్ డాక్టర్ మహేందర్ అందజేశారు.